
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 12 మార్చి 2025



సొంత వాహనాలపై 'పోలీస్' స్టిక్కర్ నిషేధం: హోం మంత్రి

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తున్నా సొంత వాహనాలపై 'పోలీస్' అనే స్టిక్కర్, బోర్డులు వేసుకోవడం నిషేధమని హోం మంత్రి పరమేశ్వర్ స్పష్టం చేశారు. ఒకవేళ అలారాసి ఉంటే చట్ట ఉల్లంఘనకు పాల్పడినట్లే అన్నారు. మంగళవారం శాసనసభలో శ్రావణబెళగొళ జేడీఎస్ ఎమ్మెల్యే సీఎన్ బాలకృష్ణ అడిగిన ప్రశ్నకు హోం మంత్రి సమాధానమిచ్చారు. పోలీసుశాఖలో పనిచేసేవారు సొంతవాహనాలపై 'పోలీస్' అని స్టిక్కర్ల ఏర్పాటు చేసే అవకాశం లేదన్నారు. ఎక్కడైనా కొనసాగుతుంటే హోంశాఖ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మూసివేత దిశగా..!



- అధ్వానంగా విశ్వవిద్యాలయాలు
- 9 యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేరు
- సగంమంది అధ్యాపకుల కొరత
- రూ.లక్షల్లో విద్యుత్ బకాయిలు
- మూసేసే ఆలోచనలో ప్రభుత్వం
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు


కర్ణాటక యూనివర్సిటీ

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎందరో విద్యావంతులను దీర్చిదిద్దాల్సిన యూనివర్సిటీలు మూసేసే పరిస్థితికి చేరుకున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలోనే కాకుండా దేశంలోనే ఉన్నత విద్యారంగంలో ముందంజలో ఉందని చెప్పుకొంటున్న కర్ణాటకలోని విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా మారింది. బీజేపీ పాలనలో ప్రారంభించిన 9 యూనివర్సిటీలను మూసివేయాలనే చర్చ జరుగుతున్న తరుణంలోనే సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న 32 యూనివర్సిటీలు దారుణ పరిస్థితిలో ఉన్నాయని, అవి కూడా ఎప్పుడైనా మూతపడే అవకాశాలు లేకపోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నత విద్యావిభాగంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత వెంటాడుతోంది. కొన్ని యూనివర్సిటీల్లో సగానికిపైగా అధ్యాపకులు, ఉద్యోగులు లేరు. 9యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్లు లేరు. కరెంటు బిల్లులు చెల్లించడానికి కూడా కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వేతనాలు, పెన్షన్ల ఖర్చు పోగా అభివృద్ధికి మిగులుతోంది కేవలం 3శాతం నిధులు మాత్రంగానే ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రధాన సమస్యలివే...

పాత యూనివర్సిటీలకు ఆర్థిక, పాలనాపరమైన పరిస్థితి అధ్వానంగా మారింది. మంగళూరు యూనివర్సిటీ గ్రామ పంచాయతీకి రూ.40లక్షలు పన్ను కట్టాల్సి ఉంది. గ్రామపంచాయతీ, యూనివర్సిటీల అధ్యాపకుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటు చేసుకుంది. ధారవాడతోపాటు పలు యూనివర్సిటీలకు దైనందిన కార్యకలాపాలకు నిధుల కొరత వెంటాడుతోంది. పాతయూనివర్సిటీల అభివృద్ధికోసం కేవలం 33.50 కోట్లు రూపాయలు విడుదల చేశారు. ఈ నిధులు అన్ని యూనివర్సిటీలకు కేటాయించడం గగనమవుతోంది. 6 యూనివర్సిటీల అభివృద్ధి పనులకు రెండేళ్లుగా గ్రాంట్లు విడుదల జరగనేలేదు. కొత్త యూనివర్సిటీలు ప్రారంభిస్తున్నామని గొప్పగా చెప్పుకొన్నా రెగ్యులర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని నియమించుకోలేదు. అసలే రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు ఉంది. వారిలోనూ కొందరిని బదిలీలు, డెప్యుటేషన్ పద్ధతిలో పంపారు. కొంతమంది ఉద్యోగులు, అధ్యాపకులు వారి వ్యక్తిగత ప్రయోజనాలకోసం కొత్త యూనివర్సిటీలకు బదిలీ చేయించుకున్నారు.



నృపతుంగ వర్సిటీ

అధ్యాపకుల కొరత..!

రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలకు 4,709 మంది అధ్యాపకుల పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో 2,732 పోస్టులు ఖాళీ ఉన్నాయి. 1977 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. ఏటా కాంట్రాక్టు పద్ధతిన గెస్ట్ లెక్చరర్‌లను నియమించుకుని అకడమిక్‌ను కొనసాగిస్తున్నారు. బోధనేతర సిబ్బంది 9,217 పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో ఏకంగా ఖాళీలే 6,328 ఉన్నాయి. కేవలం 2,889 మంది మాత్రమే బోధనేతర సిబ్బంది ఉన్నారు.

ఈ ఏడాది బడ్జెట్‌లో అధ్యాపకుల నియామకాలను ప్రస్తావించారు. పాత యూనివర్సిటీలకు ఆర్థికంగా శక్తిని ఇచ్చేలా గ్రాంట్ల విషయం ప్రస్తావన లేదు. యూనివర్సిటీలకు గ్రాంట్లు లేదా ఇతరత్రా కార్యక్రమాలను ప్రకటించలేదు. ఇది రాష్ట్ర యూనివర్సిటీల భవితవ్యంపై దెబ్బతీసినట్టయ్యింది. పలు యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్‌లు లేరు. మొత్తంగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిస్థితి కోమాకు చేరినట్లు అయింది.

6 యూనివర్సిటీలకు గ్రాంట్లు లేవు

రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ యూనివర్సిటీలకు నిధులు మంజూరు కాలేదు. వాటిలో మైసూరు యూనివర్సిటీ, కర్ణాటక యూనివర్సిటీ, బెంగళూరు యూనివర్సిటీ, గుల్బర్గా, దావణగెరె, బెంగళూరు నగర యూనివర్సిటీలకు గడిచిన రెండేళ్లుగా గ్రాంట్లు కేటాయించలేదు. మంగళూరు యూనివర్సిటీ, కువెంపు యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ, విజయనగర, బెళగావి, మండ్య, రాయచూరు, సంస్కృత విశ్వవిద్యాలయాలకు ఏడాదిలో అభివృద్ధి గ్రాంట్లు వరించాయి.


మైసూరు విశ్వవిద్యాలయం

అభివృద్ధికి 3శాతం నిధులే...

విశ్వవిద్యాలయాలు వేతనాలు, పెన్షన్లు మినహాయిస్తే కేవలం 3శాతం మాత్రమే నిధులు ఉన్నాయి. 22 పాత యూనివర్సిటీలకు 2022-23లో రూ.810.62 కోట్లు వేతనాలు, 234.63 కోట్లు పెన్షన్లకు, 2023-24లో రూ.705.7 కోట్లు వేతనాలకు, రూ.205.54 కోట్లు పెన్షన్లకు కేటాయించారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి పనులకు 33.50 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ప్రస్తుతానికి కర్ణాటక యూనివర్సిటీ, డాక్టర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, మండ్య యూనివర్సిటీ, నృపతుంగ యూనివర్సిటీ, మహారాణి క్లస్టర్, రాయచూరు, అక్క మహాదేవి యూనివర్సిటీ, గ్రామీణాభివృద్ధి యూనివర్సిటీ, గుల్బర్గా యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్‌లు లేక ఇన్‌చార్జ్‌లతోనే పాలన సాగిస్తున్నారు.

భర్తీకాని ఖాళీలు..

రాష్ట్రంలో 32 ప్రభుత్వ యూనివర్సిటీలు ఉన్నాయి. 30 ప్రైవేట్, 12 డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయి. అధ్యాపకులలో 58శాతం పోస్టులు, బోధనేతర సిబ్బందిలో 69శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మైసూరు యూనివర్సిటీకి 572మంది బోధన సిబ్బంది పోస్టులు మంజూరు కాగా 379 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 600మంది పనిచేసే చోట కేవలం 200మంది కుస్తీ పడాల్సి వస్తోంది. 799 బోధనేతర సిబ్బందిపైకి 366 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కర్ణాటక యూనివర్సిటీలో 620మంది అధ్యాపకులకుగాను 414మంది, 1201 బోధనేతర పోస్టులలో 849, బెంగళూరు యూనివర్సిటీలో 365మందికిగాను 234మంది, బోధనేతర సిబ్బందిలో 1176కుగాను 780, మంగళూరు యూనివర్సిటీలో 272మంది అధ్యాపకులకుగాను 141 మంది, బోధనేతర సిబ్బంది 547 పోస్టులకుగాను 372 ఖాళీగా ఉన్నాయి.


హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

హంస వాహనంపై ఖాద్రీశుడు

కదిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి మంగళవారం హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజలు, హోమం నిర్వహించిన అనంతరం శ్రీవారిని మాడ వీధులలో ఊరేగించారు. సంధ్యా సమయంలో శ్రీవారు హంసవాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈవో శ్రీనివాస రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారు బుధవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా..!

- భక్తిశ్రద్ధలతో సిడి బండి ఉత్సవం
- ప్రారంభించిన ఎమ్మెల్యే నారా..
- భారీగా తరలివచ్చిన భక్తులు


అలంకరణలో అమ్మవారు, తరలివచ్చిన భక్తులు

బళ్లారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అమ్మల గన్నయమ్మా.. కనకదుర్గమ్మా..కరుణించమ్మా..అంటూ అమ్మవారిని స్మరించుకుంటూ భక్తులు పులకించిపోయారు. మంగళవారం బళ్లారి కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. కర్ణాటకలోని నలుమూలల నుంచే కాకుండా, సరిహద్దు జిల్లాల నుంచి విశేషంగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా సిడి బండి ముందురోజే ఆలయం వద్దకు చేరకుంది. మంగళవారం ఉత్సవాలను ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. దేవాలయం చుట్టూ సిడి బండి మూడు ప్రదక్షిణలు చేసి ఎటువంటి ఆటంకం లేకుండా యథాస్థానానికి చేరుకుంది. భక్తులు అమ్మవారికి కోళ్ళు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, పూలు సిడిబండిపై వేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీశ్, కార్పోరేటర్లు తదిరులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 5-30 గోధూళి సమయంలో బళ్లారి కనకదుర్గమ్మ సిడి బండి రథోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు.




ఆలయ ప్రదక్షిణ చేస్తున్న సిడిబండి


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.46	5.17
బుధవారం సాయంత్రం	గురువారం ఉదయం

లెజిస్లేచర్ భేటీలో మంత్రుల వాగ్వాదం
7
భవన నిర్మాణ కార్మికుల కోసం 'మొబైల్ అంబులెన్స్'


హోంగార్డ్ హేమాద్రి (ఫైల్)


నాగరత్నమ్మ (ఫైల్)


దేవరాజు (ఫైల్)


బస్సు ఢీకొనడంతో నుజ్జయిన బైక్

ఏపీలో రోడ్డు ప్రమాదం

- రెండు బైకులను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- హోంగార్డు, భార్య, కుమారుడి మృతి

రాయచూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏపీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కర్ణాటకవాసుల సహా ఐదుగురు మృతి చెందారు. కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని పెద్దతుంబలం-కౌతాళం మధ్య ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాయచూరు జిల్లాకు చెందిన హోంగార్డ్ హేమాద్రి(50), ఆయన భార్య నాగరత్నమ్మ (45), కుమారుడు దేవరాజు(25), కర్నూలు జిల్లా కుప్పగల్లు గ్రామానికి చెందిన పూజారి ఈరన్న (25), పూజారి ఆదిలక్ష్మి (23) దంపతులు మృతి చెందారు. కొప్పళ నుంచి మంత్రాలయం వెళుతున్న కేఎస్ ఆర్టీసీ బస్సు (కేఏ 37 ఎఫ్ 0711) రెండు బైకులను వేగంగా ఢీకొట్టింది. ప్రమాద స్థలంలో రహదారి వాలుగా (యూ షేప్) ఉంది. అక్కడ బస్సు వేగాన్ని ఏమాత్రం తగ్గించకుండా వెళ్లడం.. పైకి ఎక్కుచోట బైకులు ఎదురు రావడంతో డ్రైవర్ బస్సును అదుపుచేయలేక ఢీకొట్టినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారీ అయ్యాడు. ఆదోని పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాయచూరు జిల్లా మాన్వి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మేమాద్రి హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య, కుమారుడితో కలిసి ఆయన బైక్‌పై కర్నూలు జిల్లా ఇస్వికి వైద్యం కోసం వస్తుండగా ప్రమాదం జరిగింది. హేమాద్రి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు తెలియగానే స్థానికంగా విషాదం అలుముకుంది. అందరి తోనూ కలిసిమెలసి ఉండే హేమాద్రి, కుటుంబ సభ్యులు ఇలా విగతజీవులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రానైట్‌కు గడ్డుకాలం

80% ఫ్యాక్టరీల మూత

- స్వస్థలాలకు వెళ్లిపోయిన కార్మికులు
- వైసీపీ హయాంలో పెరిగిన రాయల్టీ, విద్యుత్ చార్జీలు
- కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి
- మూతపడ్డ పరిశ్రమల్లో గొర్రెల పెంపకం, కట్టెల డిపోలు

గ్రానైట్ పరిశ్రమకు రాష్ట్రంలోనే చీమకుర్తి తర్వాత ప్రసిద్ధిగాంచినది తాడిపత్రి. దశాబ్దాలుగా గ్రానైట్, నల్లబండల ఫ్యాక్టరీలతో కళకళలాడిన ఈ ప్రాంతం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలవెలబోయింది. ఏకంగా 80 శాతం పరిశ్రమలు మూతపడ్డాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చారు. నేడు ఇక్కడి కార్మికులే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న దయనీయ పరిస్థితులు దాపురించాయి.


మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ


మిషన్లను తీసివేయడంతో ఖాళీగా గ్రానైట్ పరిశ్రమ

తాడిపత్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎందరికో ఉపాధి కల్పించిన గ్రానైట్ పరిశ్రమ నేడు కుదేలయింది. తాడిపత్రి పరిసరాల చుట్టూ గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు విస్తారంగా వ్యాపించి ఉన్నాయి. వీటిలో వివిధ స్థాయిలో పనులు చేసుకుంటూ వేలాదిమంది ఉపాధి పొందేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రానైట్ పరిశ్రమ బాగానే ఉంది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏడాదికేడాది విద్యుత్ చార్జీలు, రాయల్టీ, మైనింగ్ కంపెనీలను ప్రైవేట్ పరం చేయడం తదితర కారణాలతో పరిశ్రమలు కుదలేయ్యాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతినే కొనసాగిస్తుండడంతో పరిశ్రమ యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో రాయల్టీలు పెరగడం, విద్యుత్ భారంతో పరిశ్రమలు దివాలా తీశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అదే పద్ధతిలోనే కొనసాగుతడడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులకు మింగుడుపడడం లేదు.

80 శాతం మూత

తాడిపత్రి ప్రాంతంలో గతంలో దాదాపు గ్రానైట్ ఫ్యాక్టరీలు 650, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 1800 ఉండేవి. ప్రస్తుతం గ్రానైట్ ఫ్యాక్టరీలు 100, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 450 మాత్రమే ఉన్నాయి. నానాటికి పన్నుల పోటుతో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. గతంలో విద్యుత్ చార్జీలు, రాయల్టీలు తక్కువగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో పన్నులు రెట్టింపు కావడంతో 80 శాతం మేర పరిశ్రమలు మూతబడ్డాయి. కరెంట్ బిల్లులు కట్టలేక చాలామంది నిర్వాహకులు గ్రానైట్, నల్లబండల ఫ్యాక్టరీలను అమ్ముకున్నారు. గతంలో రాయల్టీ మీటరుకు రూ.2,500 ఉండగా.. ప్రస్తుతం రూ.5,600 ఉంది. వీటికి తోడు మైనింగ్ అధికారులు చెక్‌పోస్టులు పెట్టడంతో నిర్వహణ కష్టంగా మారింది. వీటిలో ఒక్కొక్క లారీకి రూ.9వేల నుంచి రూ.15వేల చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ముడిసరుకు రవాణా చేయాలంటే టన్నుకు రూ.800 ఉండేది. ప్రస్తుతం రూ.1300కు పెరిగింది. గతంలో ఒక పరిశ్రమకు విద్యుత్ బిల్లు నెలకు రూ.80వేల వరకు వచ్చేది. ఇప్పుడు లక్షన్నర వరకు బిల్లులు వస్తుండడంతో ఆదాయం లేక బిల్లులు కట్టలేక పరిశ్రమల యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ఫ్యాక్టరీలను మూసేశా

గతంలో నాలుగు ఫ్యాక్టరీలను నిర్వహించేవాడిని. ప్రస్తుతం పన్నులు, విద్యుత్‌బిల్లుల భారంతో రెండు ఫ్యాక్టరీలను మూసివేసి రెండింటిని మాత్రమే నిర్వహిస్తున్నాను. రెండేళ్ల క్రితం పన్నులపోటు వల్ల సుమారు రూ.10లక్షల వరకు అప్పులు కావడంతో రెండు పరిశ్రమలను మూసివేయాల్సి వచ్చింది. పన్నులు ఇలాగే కొనసాగితే మిగతా రెండు కూడా మూసివేయాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకుంటే పరిశ్రమల మనుగడ కొనసాగుతుంది.



-నబీరసూల్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని


గొర్రెల షెడ్డుగా మారిన మూసివేసిన పరిశ్రమ

గొర్రెల షెడ్లుగా పరిశ్రమలు

పన్నులపోటు భరించలేక గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలను కొందరు యజమానులు గొర్రెల షెడ్లుగా లీజుకు ఇస్తున్నారు. మరి కొందరు చెక్కకోత మిషన్లకు, డిపోలకు బాడుగకు ఇస్తున్నారు. మూతపడ్డ పరిశ్రమల్లోని మిషనరీని గుజిరీకి వేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పులు పెరిగిపోవడంతో ఫ్యాక్టరీలను అమ్ముకుంటున్నారు. మరికొన్నిచోట్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఫ్యాక్టరీలను పడగొట్టి ప్లాట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఫ్యాక్టరీలు మూతపడడంతో చాలామంది కార్మికులు రోడ్డునపడుతున్నారు. ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

వైసీపీ హయాంలో పన్నుల పోటు



2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పన్నుల భారం ఎక్కువయింది. ఏడాదికేడాది ముడిసరుకుల ధరలు పెరగడం, విద్యుత్ చార్జీలు పెరగడంతో నిర్వహణ కష్టమయింది. వ్యాపారాలు లేక, బిల్లులు చెల్లించలేక చాలామంది ఫ్యాక్టరీలను మూసివేశారు. పన్నుల భారంతోపాటు ప్రైవేట్ చెక్‌పోస్టులు ఎక్కువయ్యాయి. కొత్త ప్రభుత్వంలోనైనా పన్నుల భారం తగ్గించి మాకు న్యాయం చేయాలి.

-శంకర్‌నాయుడు, నల్లబండల ఫ్యాక్టరీ యజమాని

సొంత రాష్ట్రాలకు వెళ్లిన కార్మికులు

తాడిపత్రి ప్రాంతంలోని పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వేలాది మంది కార్మికులు బీహార్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, అస్సాం, ఒడిషా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చారు. ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడే జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలు మూతపడుతుండడంతో ఉపాధి లేక సొంత రాష్ట్రాలకు తిరిగి వెళుతున్నారు. యజమానులు చేసేదిలేక కూలీలను వెనక్కి పంపిస్తున్నారు.

కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు



గ్రానైట్, కడపస్లాబ్ పరిశ్రమలు మూసివేస్తుండడంతో మా కుటుంబసభ్యులు చాలా మంది సొంత ఊరికి వెళ్లారు. నేను ఒక్కడినే ఇక్కడ ఉంటూ బండలపాలిష్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నా. ఈ పని కూడా ఎన్నాళ్లు ఉంటుందో తెలియకుండా ఉంది. సొంత ఊళ్లో పనులు లేక ఇక్కడికి వస్తే ఇక్కడ కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

- శ్రీరాములునాయక్, వలసకూలీ,

మేనమామ మోసం...!

పేద విద్యార్థినులకు శాపం

- టీడీపీ హయాంలో ఎంజేపీ నిర్మాణం ప్రారంభం
- సగం మేర పనులు పూర్తి
- వైసీపీ పాలనలో అటకెక్కిన వైనం
- పైసా కూడా బిల్లులు చెల్లించని దుస్థితి
- రేకుల షెడ్లలో బాలికల అవస్థలు


మొండిగోడలతో ఎంజేపీ పాఠశాల భవనం


గుమ్మఘట్టలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల

గుమ్మఘట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తాను మేనమామనని ప్రకటించుకున్న మాజీ సీఎం జగన్.. క్షేత్రస్థాయిలో వారికి తీవ్ర అన్యాయం చేశారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో బాలికా విద్యను పెంపొందించేందుకు టీడీపీ హయాంలో మండలంలోని గోనబావి గ్రామం వద్ద మహాత్మ జ్యోతిరావ్ పూలే బాలికల (ఎంజేపీ) గురుకుల విద్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేశారు. పనులు సగం వరకు పూర్తి చేశారు. ఈ ప్రాంత విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషపడ్డారు. ఇంతలోనే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి అయిన జగన్.. విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామంటూ గొప్పలు చెప్పారు. బాలికా విద్య కోసం నిర్మిస్తున్న ఎంజేపీ విద్యాలయంపై నిర్లక్ష్యం చూపారు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. జగన్ పుణ్యమాని ఏడేళ్లుగా తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యార్థినులు అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. కనీస వసతుల్లేక తిప్పలు పడుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో పాఠశాల భవనాల పనులు మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.. ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వెంటనే పనులు మొదలెట్టేలా చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా పనులు జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీటిని పరిష్కరించి, వెంటనే భవన నిర్మాణాలు పూర్తి చేసి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికైనా అందుబాటులోకి తేవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసీపీ పాపం..

రాయదుర్గం వెనుకబడిన ప్రాంతం. చాలామంది వలసలు వెళ్తారు. పేదరికం తదితర కారణాలతో చాలామంది పిల్లలు చదువుకు దూరమౌతున్నారు. టీడీపీ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అప్పట్లో మంత్రిగా పని చేసిన కాలవ శ్రీనివాసులు ఈ ప్రాంతంలో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు గురుకుల పాఠశాల అవసరమని భావించారు. పాఠశాల నిర్మాణానికి ఉపక్రమించారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామ సమీపాన రూ.24 కోట్లతో 2016లో విద్యాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. రెండేళ్లపాటు రూ.12 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులకు గ్రహణం పట్టింది. పైసా కూడా బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. అప్పట్నుంచి ఏడేళ్లుగా ఆ భవనాలు దిష్టిబొమ్మలా కనిపిస్తున్నాయి. విద్యాలయాన్ని తాత్కాలికంగా గుమ్మఘట్టలోని సొసైటీ షెడ్లలో నిర్వహిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు 400 మంది దాకా విద్యార్థినులు చదువుకుంటున్నారు. తాత్కాలిక షెడ్లలో కనీస వసతుల్లేక విద్యార్థినులు ఏడేళ్లుగా నరక యాతన అనుభవిస్తున్నారు.

నిధులు పెంచి..

గతేడాది కూటమి అధికారంలోకి రావడంతో ఎంజేపీ విద్యాలయ నిర్మాణంపై ఆశలు రేగాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. మరో రూ.8 కోట్ల మేర నిధులు పెంచి, పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు నిధులు మంజూరు చేశారు. పనులు మొదలవాల్సి ఉంది. మూడునెలలుగా పనులు ముందుకు కదలడం లేదు. విద్యా సంవత్సరం దగ్గర పడుతుండడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు మొదలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ల ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. వాటిని పరిష్కరించి, వెంటనే పనులు మొదలయ్యేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలి

వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా పాఠశాల భవనాలు పూర్తి చేయాలి. మూడునెలల క్రితం మంత్రి సవిత హామీ ఇచ్చి వెళ్లారు. అధికారులు పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. వెంటనే పనులు ప్రారంభించాలి.



- రవి, విద్యార్థిని తండ్రి, గోనబావి

పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం

గతంలో గురుకుల భవన నిర్మాణ టెండర్ దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థకు పనులు ప్రారంభించాలని నోటీసులు జారీ చేశాం. సంబంధిత కాంట్రాక్టు సంస్థ నుంచి సమాధానం రాలేదు. ఆ సంస్థ ప్రారంభించకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

-శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

'మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి, రామాయణ రచయిత మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13వతేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ చైతన్యం

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

కళ్యాణదుర్గం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పొలాలకు పేడ ఎరువులు వేస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో తలెత్తుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ, మేక, గొర్రెల ఎరువులను పొలాలకు తోలుతున్నారు. పశువులు లేని రైతులు పేడ ఎరువు కొనుగోలు చేసి మరీ.. పొలాల్లో వేసుకుంటున్నారు.

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు



కర్బూజా, కళింగర పంటల సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఈ పంటలకు ఎటువంటి తెగుళ్ల సోకకుండా సేంద్రియ ఎరువులు బాగా ఉపయోగపడతాయి. పేడ ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది.

- హరీష్, రైతు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం


చేనులో తోలిన పేడ ఎరువు

రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

ఖరీఫ్ కింద ఏటా నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ సాగు చేస్తున్నారు. అంతర పంటలు కూడా వేసుకుంటారు. పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. కర్బూజా, కళింగర, టమోటా, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు అంటున్నారు. కొనుగోలు చేసిన సేంద్రియ ఎరువును రైతులు.. ఎండ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తోలుకునే పనిలో నిమగ్నమయ్యారు. రసాయన ఎరువుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వాటి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వెరసి పెట్టుబడి పెరిగిపోతోంది. రసాయన ఎరువుల వాడకం వల్ల పంటలకు చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రసాయన ఎరువుల వినియోగానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు.

రసాయన ఎరువులకు స్వస్తి
పంటలకు పేడ ఎరువుల వినియోగం

తగ్గనున్న ఖర్చు



రసాయన ఎరువుల వాడకం కారణంగా భూమి గట్టిపడుతోంది. పంటలకు తెగులు అధికంగా సోకుతున్నాయి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. దీంతో ఏటా పశువుల ఎరువునే వాడుతా.

- రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి

లాభాలు అనేకం..

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వేస్తే పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. దీంతో చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్ల కూడా తక్కువే. రైతుకు ఖర్చు తగ్గి, అధిక ఫలసాయం లభిస్తుంది.

- ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

డ్వామాలో బదిలీల ఫీవర్

- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా నిర్వహణకు కసరత్తు
- తాజాగా ఏపీడీల బదిలీలతో మొదలైన చిచ్చు
- చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు



అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డ్వామాకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. గత ఏడాది సెప్టెంబరులో ఉద్యోగుల బదిలీలు చేపట్టినా.. డ్వామా నుంచి ఎవ్వరినీ కదిలించలేదు. ప్రభుత్వం అనుమతివ్వలేదు. దీంతో డ్వామాలో ఉద్యోగుల బదిలీలు త్వరలో ఉండొచ్చని తాజా సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల ఇద్దరు ఏపీడీల బదిలీతో ఉద్యోగుల్లో చిచ్చు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుత్తి, తాడిపత్రి, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర, ఓడీసీ, పుట్టపర్తి క్లస్టర్లున్నాయి. తాజాగా గుత్తి, తాడిపత్రి ఏపీడీలను బదిలీ చేయడం పట్ల డ్వామా ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు క్లస్టర్లకు ఏపీఓలు.. ఇన్‌చార్జి ఏపీడీలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనే ఏళ్లుగా పనిచేస్తున్న ఏపీడీలను కోరుకున్న స్థానానికి బదిలీ చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో డ్వామాలో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టేందుకు సీఆర్‌డీ నుంచి సూచనప్రాయంగా అనుమతి లభించినట్లు సమాచారం. త్వరలో ఉద్యోగుల బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. బదిలీల్లో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్ విభాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో హవా సాగించిన ఉద్యోగులే ఉండడం గమనార్హం. గత వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఉన్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు బదిలీల్లో తమకు అనుకూలంగా ఉండే వారికే ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించి, తరువాత బదిలీలు చేపట్టాలని డ్వామా ఉద్యోగులు కోరుతున్నారు. డ్వామాలో వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఏడేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. వాటర్‌షెడ్ పీఓలను కూడా బదిలీ చేస్తారా.. వారినే కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.


డ్వామా కార్యాలయం

చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగం

డ్వామాలో బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో హెచ్‌ఆర్ విభాగమే కీలకం. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా 63 మండలాల్లో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల చేపట్టనున్నారు. ఏడేళ్లుగా హెచ్‌ఆర్‌లో పాతుకుపోయిన ఉద్యోగులే బదిలీలు చేపడుతుండడంతో అర్హులకు అన్యాయం వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. మొదట హెచ్‌ఆర్ విభాగంలో పనిచేసే వారికి స్థానచలనం కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, డ్వామా పీడీల వద్ద చర్చకు వచ్చినట్లు సమాచారం.

బదిలీలు ఉండొచ్చు..


ఉద్యోగుల బదిలీలు ఉండొచ్చని సీఆర్‌డీ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, టీఏ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టాలని నిబంధన ఉంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయిలో నియమ, నిబంధనలు రావాల్సి ఉంది. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి కచ్చితంగా స్థానచలనం ఉంటుంది. బదిలీల్లో ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం వాటిల్లకుండా చూస్తాం. సీనియార్టీ ప్రకారం ఉద్యోగుల వివరాలను సిద్ధం చేయాలని సూచించాం.

-సలీంబాషా, డ్వామా పీడీ

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

ఎడ్వర్డ్ ఫ్రాంక్లిన్ అల్బీ (జయంతి)



అమెరికా దేశానికి చెందిన కథా రచయిత ఎడ్వర్డ్ ఫ్రాంక్లిన్ అల్బీ-3 1928 మార్చి 12న జన్మించారు. ది జూ స్టోరీ, ది స్యాండ్‌బాక్స్, హూస్ అఫ్రైడ్ ఆఫ్ వర్జీనియా ఉల్ఫ్, ఏ డెలికేట్ బ్యాలెన్స్, త్రీ టాల్ ఉమెన్ వంటి రచనలు ఎంతో పేరొందాయి. 'పులిట్జర్ ప్రైజ్ ఫర్ డ్రామా', టోనీ అవార్డ్ ఫర్ బెస్ట్ ప్లే అవార్డులు అందుకున్నారు. 'అమెరికన్ థియేటర్ హాల్ ఆఫ్ ఫేం'లో చోటు దక్కించుకున్నారు. ఇతర గౌరవాలు ఒందారు. నాఫ్తా నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2016 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

అనిష్ కపూర్ (పుట్టినరోజు)



బ్రిటీష్ భారతీయ శిల్పి సర్ అనిష్ కపూర్ 1954 మార్చి 12న ముంబైలో జన్మించారు. ఇన్‌స్టాలేషన్ ఆర్ట్ అండ్ కాన్సెప్చుయల్ ఆర్ట్ ఆయన ప్రత్యేకత. ప్రీమియో దుమిల ప్రైజ్, టర్నర్ ప్రైజ్ యూనిలివర్ కమిషన్ ఫర్ ది టర్బైన్ హాల్, అత్యున్నత పద్మభూషణ్ పురస్కారం, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. క్లౌడ్ గేట్ (ది బీన్), పారిస్‌లోని గ్రాండ్ పలాసిస్, ఆర్సిలర్ మిట్టల్ ఆర్బిట్ వంటి డిజైన్‌లు ప్రముఖమైనవి. 2024లో ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్ కేథడ్రల్ చర్చ్ శతాబ్ది సంబరాలలో అనిష్‌కపూర్‌కు చెందిన ప్రదర్శనలు ఏర్పాటు చేయడం విశేషం.

శ్రేయ ఘోషల్ (పుట్టినరోజు)



జాతీయస్థాయిలో పేరొందిన ప్రముఖ నేపథ్య గాయని శ్రేయ ఘోషల్ 1984 మార్చి 12న పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్ జిల్లా దుర్గాపూర్‌లో జన్మించారు. ప్రత్యేకించి హిందీ సినీ రంగంలో గాయనిగా రాణించారు. కన్నడ, తెలుగు, తమిళం, అస్సామీ, బెంగాలీ, పంజాబీ, మళయాళం భాషలలో కూడా ఎన్నో పాటలు పాడారు. గేయ రచయితగా, కంపోజర్‌గా, మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా సత్తా చాటుకున్నారు. సినిమా పాటలు, పాప్ సాంగ్స్, ఘజల్స్, భజనలు, హిందూస్తానీ శాస్త్రీయ సంగీత పాటల్లోనూ ప్రతిభ చాటుకున్నారు. 4 జాతీయ పురస్కారాలు, 5 ఉత్తరాది ఫిల్మ్‌ఫేర్, 4 దక్షిణాది ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 2017లో మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో మైనపు బొమ్మగా అవకాశం కల్పించడంతో తొలి దేశ గాయనిగా అరుదైను గుర్తింపు పొందారు.

లెజిస్లేచర్ భేటీలో మంత్రుల వాగ్వాదం

» సమస్యలను ఏకరవు పెట్టిన సభ్యులు

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలలో ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు ఎటువంటి వ్యూహాలను అమలు చేయాలని లెజిస్లేచర్ భేటీ జరిగింది. అయితే ఇద్దరు మంత్రుల మధ్య వాగ్వాదం తారస్థాయికి చేరడంతో గందరగోళం ఏర్పడింది. సోమవారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో సీఎల్పీ భేటీ జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, కేజే జార్జ్, దినేశ్ గుండూరావుతోపాటు పలువురు వేదిక అలంకరించగా సభ్యులంతా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కుట్రకు తెర లేపుతోందని, కర్ణాటకలో నియోజకవర్గాలు కుదించే అవకాశం ఉందని, పోరాటం ద్వారా దక్కించుకోవాల్సిన అవసరం ఉందని సీఎం పిలుపునిచ్చారు. ఇలా సాగుతుండగానే రాయచూరు జిల్లాలో వైద్యశాఖకు సంబంధించి ఉద్యోగుల బదిలీల అంశం వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్, చిన్నతరహా నీటిపారుదలశాఖ మంత్రి బోసరాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాయచూరు జిల్లాలో పట్టుకోసం మంత్రి శరణప్రకాశ్ బదిలీలతోపాటు పలు విషయాలలో జోక్యం చేసుకుంటున్నారని బోసరాజు ఆరోపించారు. తాను రాయచూరు జిల్లా వాసినని, బదిలీలకోసం ఎందుకు సిఫారసు లేఖలు అందిస్తారని బోసరాజు ప్రశ్నించారు. అందుకు దీటుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరిస్తున్నందున ఎమ్మెల్యేల డిమాండ్లకు అనుగుణంగా స్పందించడం



సీఎల్పీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నా కర్తవ్యమన్నారు. ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌కు సిఫారసు లేఖ ఇవ్వడాన్ని బోసరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. నన్ను సంప్రదించకుండా ఎలా సిఫారసు లేఖ ఇస్తారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్నానని, నేనెందుకు మీ అనుమతులు కోరుతానంటూ శరణప్రకాశ్ పాటిల్ సమాధానం చెప్పారు. ఇదే సందర్భంలోనే ఒకరిపై మరొకరు దూసుకొచ్చి చేయిజేసుకునేందుకు ప్రయత్నించారు. అంతలోనే డీసీఎం వారిద్దరినీ వారించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చలు జరిగాయి.

భవన నిర్మాణ కార్మికులకోసం 'మొబైల్ అంబులెన్స్'



మొబైల్ అంబులెన్స్‌లకు పచ్చజెండా ఊపుతున్న సీఎం

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పన్నెండో శతాబ్దంలోనే సమసమాజం ఆశించిన బసవణ్ణ 'కాయక దాసోహ' (కష్టపడేవారికి ఆహారం అందుబాటులో ఉండాలనే) ఆశయంతో పాలన సాగిస్తున్నామని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేలా 135 మొబైల్ అంబులెన్స్‌లను కార్మికశాఖ ద్వారా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మంగళవారం విధానసౌధ తూర్పుద్వారం వద్ద మొబైల్ అంబులెన్స్ సేవలకు పచ్చజెండా చూపారు. కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో కార్మికులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ మంత్రి సంతోష్‌లాడ్ ఒక ఆశయంతో కార్మికులకోసం మొబైల్ అంబులెన్స్‌లను తీసుకొచ్చారన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలు విద్యకు దూరం కారాదనే ఉచిత భోజనం, రెసిడెన్షియల్ స్కూల్‌లో వారికి సీట్లు కేటాయించ దలిచామన్నారు. భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలి



జిల్లాస్థాయి పోటీలకు బయల్దేరిన బృందం

బాగేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ)లు జిల్లాస్థాయిలోనూ రాణించాలని బీఈఓ వెంకటేశప్ప అభిలషించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మంగళవారం జిల్లాస్థాయి పోటీలకు బయల్దేరిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించి బస్సుకు పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఉత్తమంగా ప్రతిభ చాటి గెలుపొంది తాలూకా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపచేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపిక కావాలన్నారు. తాలూకా వ్యాయామ అధికారి ఆర్ రంగనాథ్, తాలూకా విద్యా సమన్వయాధికారి ఆర్ వెంకటరామ్, తాలూకా పీఈటీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల్యంనుంచే సంస్కారం నేర్పాలి

శిడ్లఘట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లల మానసిక వికాసంలో పెరిగిన వాతావరణం, చుట్టుపక్కల పరిస్థితులు వంటివి జీవనపర్యంతం ఎంతో ప్రభావం చూపుతాయని అందుకే బాల్యం నుంచి చక్కటి సంస్కారం, కృతజ్ఞత వంటి మనోభావాలు అలవరుచుకునేలా ప్రోత్సహించాలని వక్తలు పేర్కొన్నారు. బీకేఆర్ అకాడమీ యూరోకిడ్స్ ఆధ్వర్యంలో పోలీసు, ఆరోగ్యశాఖ సహా పలు శాఖల కార్యాలయాల సందర్శన చేపట్టారు. పిల్లల్లో భాషా కౌశల్యం, భావనాత్మకత, ఆత్మస్థైర్యం పెంపొందించేలా అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వినయ్ అభిప్రాయపడ్డారు. బీకేఆర్ అకాడమీ ఉపాధ్యాయులు ధనలక్ష్మి, శిల్పా, సానియ, తనుజా, నేహ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన చిన్నారులు

కారుణ్య మరణానికి అవకాశమివ్వండి

» బ్యాడరహళ్ళి ఆటోడ్రైవర్ల డిమాండ్



లేఖలను చూపుతున్న ఆటోడ్రైవర్లు

దొమ్మసంద్ర, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని వైట్‌బోర్డ్ బైక్ ట్యాక్సీలకు అడ్డుకట్ట వేయడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని, జీవనం గడవడం కష్టంగా ఉన్న తమకు కారుణ్యమరణం కల్పించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆనేకల్ తాలూకాలోని బ్యాడరహళ్ళి ఆటో డ్రైవర్ల సంఘం సభ్యులు కారుణ్య మరణానికి అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్రపతికి రాసిన లేఖలను మంగళవారం మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేని బైక్ ట్యాక్సీలతో తమ జీవనానికి గండి పడిందన్నారు. జీవితంలో ఆత్మస్థైర్యం కోల్పోయామన్నారు. ఆటోలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు బతికే పరిస్థితి లేదన్నారు. సమిష్టిగా నిర్ణం తీసుకున్నామన్నారు. బెంగళూరు ఆటోసేన రాష్ట్ర అధ్యక్షుడు చేతన్ తదితరులు పాల్గొన్నారు.

రస్సెల్ మార్కెట్‌లో రాయితీతో ఖర్జూరాలు



దుకాణంలో ఖర్జూరాల విక్రయం

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఉపవాసదీక్షలు చేసే వారికోసం రాయితీ ధరతో ఖర్జూరాలను అందిస్తున్నారు. దశాబ్దాలుగా శివాజీనగర్ రస్సెల్‌మార్కెట్‌లో ఖర్జూరాలు విక్రయిస్తారు. అరబ్‌దేశాలలో పండే ఖర్జూరాలు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతాయి. ఖర్జూరాలలో వివిధ పోషకవిలువలు ఉంటాయి. ఉపవాసదీక్షలో ఉండేవారు ఖర్జూరంతో దీక్ష విరమించడం ద్వారా శక్తిని పొందవచ్చునని న్యూట్రిషన్స్ అభిప్రాయంగా ఉంది. ఇలా నగర పరిధిలో దీక్షలు చేసే లక్షలాదిమంది ఖర్జూరాలతో విరమిస్తారు. అన్నివర్గాలకు అందుబాటులో ఉండేలా రస్సెల్ మార్కెట్‌లో కొన్నేళ్లకాలంగా వివిధరకాల ఖర్జూరాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ 35 రకాల ఖర్జూరాలు లభిస్తాయని వ్యాపారి మహ్మద్ ఇద్రిస్ తెలిపారు. షుగర్‌ఫ్రీతోపాటు సీడ్‌లెస్ తదితర రకాల ఖర్జూరాలు ఉన్నాయన్నారు. అజుబాజ్, కల్మి, షాహిద్ రకాల ఖర్జూరాలు గిఫ్ట్‌ప్యాక్ రూపంలో రూ.1200కు ఇస్తున్నామన్నారు. మూడేళ్లుగా రూ.900కే మూడు కేజీల ప్యాకెట్‌లు ఇచ్చామని ఈ ఏడాది రూ.1200కు పెంచామన్నారు. ఖర్జూరాలు కిలో రూ.150 నుంచి రూ.2వేల దాకా విలువైనవి ఉన్నట్టు తెలిపారు. శివాజీనగర్ ప్రాంతం రంజాన్‌తో సందడిగా మారింది. ఈ ప్రాంతంలో టోపీలు, అత్తర్‌లు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. రాత్రి 12 గంటలదాకా శివాజీనగర్ ప్రాంతం సందడిగా ఉంటోంది. ఇటీవల పదేళ్లకాలంలో డ్రైఫ్రూట్స్ అన్ని మాల్స్‌లోనూ లభిస్తున్నాయి. పైగా పలు కంపెనీలకు చెందిన కేవలం డ్రై ఫ్రూట్స్ విక్రయించే దుకాణాలు వెలిశాయి.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



ట్రోఫీలతో విద్యార్థులు

జాలహళ్ళి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హెగ్గనహళ్ళిలోని నిసర్గ పాఠశాల ఆవరణలో క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. బెంగళూరు ఉత్తర వలయ డీడీపీఐ కేజీ ఆంజనప్ప, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ టీఎన్ ఆంజనప్ప, ఎమ్మెల్యే మునిరాజు అధ్యక్షత వహించారు. విద్యార్థులు పాఠాలకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించేలా వ్యవహరించడంపై వక్తలు ప్రశంసించారు. పాఠశాల సంస్థాపక కార్యదర్శి హెచ్‌ఎన్ గంగాధర్, కృష్ణేగౌడ, అనిల్, హెగ్గనహళ్ళి క్లస్టర్ సీఆర్‌పీ ఎస్‌జీ కుమార్‌లు భాగస్వామ్యులయ్యారు. ఇదే సందర్భంగా విద్యార్థుల సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాల్లో భరతనాట్యం, గాయనం, వీరగాసె తదితర వంటివి సభికులను అలరించాయి. పలు అంశాలలో ప్రతిభ చాటినవారికి ట్రోఫీలతో సత్కరించారు.

సూడాన్ దేశీయుడికి కంటి చికిత్సలు



మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు దేవశిష్ దుబె, దేవికాసింగ్

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైద్య విధానంలో అత్యాధునిక చికిత్సలు వాసన్ ఐ కేర్‌లో అందుబాటులో ఉన్నట్టు నిపుణులు దేవశిష్ దుబే, దేవికాసింగ్‌లు తెలిపారు. రాజాజీనగర్ వాసన్ ఐకేర్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. సూడాన్ దేశానికి చెందిన 45 ఏళ్ల వ్యక్తి వివిధ కారణాలతో ఒక కంటి చూపు కోల్పోయారని అన్నారు. ఇతడు సూడాన్‌తోపాటు పలు ఆసుపత్రులలో పరీక్షలు చేయించుకున్నాడన్నారు. పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. ఇటీవలే వాసన్‌లో చేరగా కార్నియాల్ ఆపరేషన్, రెటీనా నిర్లిప్తత, ప్రారంభ దశలో గ్లకోమా ఉన్నట్టు గుర్తించామన్నారు. రోగి స్థితిని సమగ్రంగా అధ్యయనం చేసి ఆపరేషన్ ద్వారా కంటి చూపు వచ్చేలా చేశామన్నారు. కార్నియా శస్త్రచికిత్సలు సకాలంలో చేయించుకోవాలన్నారు.

బీజేపీ యువమోర్చా నియోజకవర్గ అధ్యక్షుడిగా నవీన్



నియామకపత్రం అందజేత

మహదేవపుర, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గ హోబళి బీజేపీ యువమోర్చా నవీన్ చౌదరి ఎంపికయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి అరవింద లింబావళి, హోబళి బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌చౌదరి మాట్లాడుతూ తనపై విశ్వాసంతో ఎన్నుకున్న నాయకులకు ధన్యవాదాలని, పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, మహేంద్రమోది తదితరులు ఉన్నారు.

బస్సు, బైక్ ఢీ.. ఒకరి మృతి

బాగేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బస్సు, బైక్‌ల మధ్య జరిగిన ప్రమాదంలో బైక్ చోదకుడు మృతి చెందాడు. మంగళవారం బాగేపల్లి నుంచి చింతామణికి వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొంది. కిత్తూరు రాణి చన్నమ్మ వసతి పాఠశాల సమీపాన జరిగిన ప్రమాదంలో మిట్టేమరికి చెందిన రంజిత్ కుమార్ (28) మృత్యువాత పడ్డాడు. ఘటనా స్థలాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ణి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముదిగెరెలోనే పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయాలి



ముళబాగిలులో గ్రామస్థుల ధర్నా

ముళబాగిలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ముదిగెరె గ్రామంలోనే పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్థులు, డీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా చేపట్టారు. ముళ బాగిలు పట్టణంలోని తాలూకా పంచా యతీ కార్యాలయం వద్ద గ్రామస్థులు తమ నిరసన వ్యక్తం చేశారు. డీఎస్ఎస్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 73వ ఆర్టికల్ సవరణకు అనుగుణంగా 1993 మే 10న పంచాయతీరాజ్ చట్టాన్ని రాష్ట్రంలో జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా వందశాతం దళితులు ఉన్న ముదిగెరె గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు మంజూరు చేశారన్నారు. అయితే గడ్డూరు గ్రామంలో పంచాయతీ కార్యాల యాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం కూడా దీనిపై పలుమార్లు సంబంధిత శాఖ మంత్రికి వినతిని సమర్పించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దళితుల పట్ల నిర్లక్ష్యం సరికాదన్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ గడ్డూరులో కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. వెంటనే కార్యాలయాన్ని ముదిగెరె గ్రామానికి మార్పు చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. ధర్నాలో కీళహొళలి సతీశ్, జగదీశ్, కోడిహళ్ళి శ్రీనివాస్, తాతికల్లు రామచంద్ర, గణేశ్‌పాళ్య కృష్ణ, ఎంవీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14న కైవార బ్రహ్మరథోత్సవం

చింతామణి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఇతిహాస ప్రసిద్ధ కైవార అమరనారేయణస్వామి బ్రహ్మరథోత్సవం ఈనెల 14న శుక్రవారం మధ్యాహ్న 1గంటకు జరగనుంది. ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ గంధోత్సవం సేవను, సద్గురు యోగి నారేయణ తాతయ్య ఆలయ ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం నిర్వహించనున్నారు. 18రోజులపాటు పూజా కైంకర్యాలు కొనసాగనున్నాయి. అంకురార్పణ, ధ్వజారోహణ సేవతో బ్రహ్మ రథోత్సవ పూజలు ప్రారంభించారు. అంకురార్పణలో భాగంగా హోమాన్ని నిర్వహించారు. గరుడధ్వజాన్ని రథవీధుల్లో ప్రదక్షిణగా ఊరేగించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజను నిర్వహించి ధ్వజారోహణ చేశారు. మంగళవారం విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా సద్గురు తాతయ్య జయంతిని పురస్కరించుకుని యోగి నారేయణ మఠంలో విశేషపూజలు కొనసాగనున్నాయి.

కిండర్‌లో మహిళలకు ఉచిత చికిత్స

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిండర్ ఆసుపత్రి, ఫెర్టిలిటీ కేంద్రం ద్వారా సీఎస్ఆర్‌లో భాగంగా ఉచితంగా మహిళలకు చికిత్సలు అందించదలిచినట్టు సీఈఓ రంజిత్ కృష్ణన్ ప్రకటించారు. మంగళవారం ఉచిత చికిత్సల శిబిరాన్ని ప్రారంభించారు. పేద వర్గానికి చెందిన మహిళలకు ఉచితంగా పరీక్షలు, సాధారణ ఆపరేషన్లను అమలు చేస్తామన్నారు. సామాన్యులకు ఆసుపత్రుల ఆర్థికభారం తగ్గించాలనే వారి ఆరోగ్య సమస్యలు పరిష్కరించడం ద్వారా జీవనంలో మార్పు తీసుకురావాలనే నిర్వహిస్తున్నామన్నారు. గర్భకోశం, అపెండిక్టమీ, బ్రెస్ట్ పరీక్షలు, కొలెసిస్టమీ, హెర్నియాతోపాటు పలు చికిత్సలు ఉచితంగా చేయదలిచామన్నారు. ఆధార్ కార్డు, బీపీఎల్ కార్డులు లేదా స్థానిక ఎమ్మెల్యేలనుంచి సిఫారసు లేఖలు తీసుకురావాలన్నారు. 'మా జీవన' అనే స్కీమ్ ద్వారా పేద మహిళలకు ఉచిత చికిత్సలు లక్ష్యమన్నారు.

ఖాద్రీశుడి ఉత్సవాలకు స్పెషల్ బస్సులు నడపండి

చేళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతమైన సత్యసాయి జిల్లాలోని కదిరి పట్టణంలో జరుగుతున్న ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు చేళూరు, బాగేపల్లి, చింతామణి, కోలారు, బెంగళూరు సహా తదితర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాలు 15 రోజులపాటు కొనసాగనున్నాయి. 20న బ్రహ్మ రథోత్సవం జరగనుంది. సరిహద్దు తాలూకాలలో లక్ష్మీనరసింహస్వామి ఇలవేల్పుగా కల్గిన భక్తులు వేలాదిమంది ఉన్నారు. ఈ నేపథ్యంలో చేళూరు, మొలకలచెరువు మీదుగా కదిరికి ప్రత్యేక బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడపాలని భక్తులు కోరుతున్నారు.

బసవణ్ణ వచనాలు అనుసరణీయం

శిడ్లఘట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శతాబ్దాలక్రితమే వచనాలతో సమాజంలో మార్పుకోసం పాటుపడిన బసవణ్ణ వచనాలు నేటికీ అనుసరణీయమని విజిపుర బసవకల్యాణమఠం మహదేవస్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కుందుగుర్కిలో బసవవేశ్వస్వామి ఒక్కలు బాంధవర అభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో బసవేశ్వర ఆలయ ఐదో వార్షికోత్సవంలో పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సరళ జీవితాన్ని ఆచరించడం, చేసే పనిలో దైవత్వాన్ని చూడడం, ఇతరులను గౌరవించడం వంటివి బసవణ్ణ తత్వాలుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షుడు ఎళువళ్ళి రమేశ్ మాట్లాడుతూ దేవస్థాన సముదాయ భవన నిర్మాణానికి తనవంతుగా రూ.10లక్షలు ఇవ్వనున్నట్టు హామీ ఇచ్చారు. ట్రస్టు అధ్యక్షుడు పీఎన్ సణ్ణేగౌడ, ఉపాధ్యక్షుడు నంజుండమూర్తి, ఎం బసవరాజ్, ట్రస్టు కార్యదర్శి మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ కోర్టు సిద్ధం చేసిన ఆర్కిడ్స్


బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేశంలో ఇటీవల ఆదరణ పొందుతున్న పికిల్‌బాల్ (టెన్నిస్‌లాంటి ఆట) క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సీవీ రామన్‌నగర్‌శాఖలో ప్రత్యేకంగా కోర్టు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉండాలని కోర్టు ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బీణా కెవసిక్ తెలిపారు. జోన్ అవుట్‌గా పిలిచే కోర్టును ఆర్కిడ్స్‌లో తొలిసారి ఏర్పాటు చేశామన్నారు. ఫిజికల్ డైరెక్టర్ పియూష్ రై మాట్లాడుతూ.. దేశంలో అభివృద్ధి చెందుతున్న పికిల్ బాల్ పట్ల విద్యార్థులలో అవగాహన పెరగడంతోపాటు జాతీయస్థాయిలో రాణించేలా తీర్చేందుకు అనుకూలంగా కోర్టు ఏర్పాటు చేశామన్నారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌తోపాటు క్రికెట్ వంటివి ప్రపంచంలోనే ప్రముఖంగా రాణిస్తున్నాయని, అదే కోవలోనే పికిల్‌బాల్ క్రీడ కూడా ప్రాచుర్యంలోకి రావాలని భావిస్తున్నామన్నారు.

ఒయాసిస్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. బెంగళూరులో మూడు కేంద్రాల ద్వారా ఎంతోమందికి సంతాన సాఫల్యాన్ని సాధ్యం చేసినట్టు మెడికల్ డైరెక్టర్ దుర్గారావ్ ప్రకటనలో తెలిపారు. మార్చి నెలాఖరుదాకా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు ఉంటాయన్నారు. ప్రియాంపిలేషన్ జెనెటిక్ టెస్టింగ్, ఎరా, మైక్రో టీఈఎస్‌ఈతో పాటు పలు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఒయాసిస్ దేశవ్యాప్తంగా కేంద్రాలు కలిగి ఉందన్నారు. అన్నిచోట్ల ఈ వెసులుబాటు ఉంటుందన్నారు.

దుండగుడి అరెస్టు

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బాలికను గర్భిణి చేసిన సంఘటన బెళగావి జిల్లాలో చోటు చేసుకుంది. గోకాక్ తాలూకా కులగోడ గ్రామంలో బసప్ప అడివప్ప హొళ్యారును పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి ఇంటి సమీపంలో ఉన్న బాలికను నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల బాలిక తీవ్ర అస్వస్థతకు లోనుకావడం, కడుపు పెరుగుతుండడంతో బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సలు చేసిన డాక్టర్లు సదరు బాలిక ఎనిమిది నెలల గర్భిణిగా ధ్రువీకరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బసప్పను మంగళవారం అరెస్టు చేశారు. కాగా అరెస్టు అయిన బసప్పకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.32	1,584.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,028	2.041
నీటి నిల్వ (టీఎంసీలు)	24.67	7.03

రిసార్టుల్లో పోలీసుల తనిఖీలు

● అనుమతులు లేకుండా మద్యం అమ్మితే చర్యలు ● టూరిస్టుల వివరాలు తప్పనిసరిగా రికార్డు చేయాలి ● ఎస్పీ అరసిద్ది హెచ్చరిక

బళ్లారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హంపి, ఆనేగొంది, సనాపుర పర్యాటక ప్రాంతాల్లో కొప్పళ ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ధ, విజయనగర ఎస్పీ శ్రీధర్‌బాబు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాత్రి విజయనగర ఎస్పీ హంపి, కామలాపుర, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా కొప్పళ ఎస్పీ గంగావతి, అనేగొంది. సనాపుర ఏరియాల్లో ఉన్న రిసార్ట్‌లో తనిఖీలు చేశారు. పర్యాటక ప్రదేశాల్లో అనుమతులు లేని రిసార్ట్ అలాగే మద్యం అమ్మకాలు చేయరాదని ఆయన హెచ్చరించారు. రిసార్ట్‌లో టూరిస్టుల వివరాలు, వారు ఏదేశం నుంచి వచ్చారు. ఎప్పుడు నుంచి ఉన్నారు. పూర్తీ గా డిజిటాల్ కంప్యూటర్‌లో నమోదు చేయా లన్నారు. అనంతరం లైసెన్స్‌లు లేని రిసార్టులను తనికీ చేసి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఇద్దరు మహిళలపై అత్యాచారం ఘటనతో పోలీసులు హంపిలో వీధివీధి జల్లెడ పడుతున్నారు. రాత్రి పూట సంచరిచే వ్యక్తుల వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు



ఓ రిసార్ట్‌లో రికార్డులు పరిశీలిస్తున్నఎస్పీ అరసిద్ధి

హెల్ప్‌లైన్ ప్రారంభం : ఎస్పీ

చారిత్రాత్మక పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులకు భద్రత నిమిత్తం హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగర, కొప్పళ ఎస్పీలు వివరించారు. హంపి, అనేగొంది ఈ రెండు ప్రాంతాల్లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కేంద్రంలో ఆరోగ్యం, పోలీస్, అగ్రిమాపక, అటవీశాఖ, ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ, పురావస్తు శాఖ సిబ్బంది ఒక టీం గా ఉంటారని తెలిపారు. హెల్ప్‌లైన్ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తుందన్నారు. పర్యాటకులు హెల్ప్‌లైన్ నంబర్ 08539-225311కు కాల్ చేయాలన్నారు. కమిటీ ఛైర్మన్‌గా రెండు జిల్లాల కలెక్టర్లు ఉంటారన్నారు.

ఆ విద్యార్థినికి ఎంత కష్టం..!

● కొద్ది సేపట్లో పరీక్ష అనగా తండ్రి మృతి
● పుట్టెడు దుఃఖంతోనే హాజరు



పరీక్షకు వెళ్తూ తండ్రి మృతదేహానికి నమస్కరిస్తున్న విద్యార్థిని

పెరంబూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులో ఎంత కష్టమొచ్చింది..! మరికొద్ది సేపట్లో ప్లస్‌టూ పరీక్షకు హాజరుకావాల్సివుండగా తండ్రి కన్నుమూశాడు. పుట్టెడు దుఃఖం ముంచుకొస్తున్నా.. గుండెను దిటవు చేసుకున్న ఆ బాలిక... కన్నీటిని ఆపుకుంటూ, భవితను వెతుక్కుంటూ ప్లస్‌టూ పరీక్షకు హాజరైంది. తిరునల్వేలి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా తమిళనాడు రాష్ట్రం పెరంబూర్ జిల్లా దిశన్‌విల్లై తాలూకా ఇట్టమొలి సమీపం వడవిల్లై గ్రామానికి చెందిన అయ్యాదురై (55)-భానుమతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో మూడో కుమార్తె మధుమిత ప్లస్ టూ చదువుతోంది. క్యాన్సర్‌తో బాధపడుతున్న అయ్యాదురై మంగళవారం వేకువజామున మృతిచెందాడు. మధుమిత మరికొద్దిసేపట్లో గణితం పరీక్ష రాయాల్సి ఉంది. అయ్యాదురై మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి తీసుకొచ్చారు. దీంతో కుటుంబీకులు, బంధువులంతా దుఃఖసాగరంలో మునిగిపోయారు. అప్పటి వరకూ గుండెలవిసేలా రోదించిన మధుమితకు.. గతంలో తండ్రి చెప్పిన మాటలు స్మరణకొచ్చాయో, లేక కర్తవ్యం గుర్తుకొచ్చిందో గానీ.. హాల్‌టిక్కెట్‌తో పరీక్షకు వెళ్లేందుకు సిద్ధమైంది. తండ్రి భౌతికకాయానికి నమస్కరించి పరీక్షకు హాజరైంది. ఆమె పరీక్ష నుంచి వచ్చాక అయ్యాదురైకి అంత్యక్రియలు నిర్వహించారు. పలువురిని కంటతడిపెట్టింది.

కంకర అన్‌లోడ్ చేస్తూ
వ్యక్తికి తీవ్రగాయాలు

● బళ్లారి వద్ద ప్రమాదం
● బాధితుడు అనంత జిల్లా వాసి



గాయపడిన ప్రకాష్

యాడికి, మార్చి11(ఆంధ్రజ్యోతి): లారీలో నుంచి కంకర అన్‌లోడ్ చేస్తూ యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం బళ్లారి సమీపాన ఉన్న దన్‌పూర్ వద్ద ఒక సిమెంట్ కర్మాగారంలో జరిగింది. ఈ సంఘటనలో బాధితుడికి ఎడమ భుజం పూర్తిగా తొలగిపోవడం తో విలవిలలాడాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. రాయలచెరువు గ్రామానికి చెందిన ప్రకాష్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రాలోని కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల గ్రామం నుంచి కంకరను లోడ్ చేసుకొని బళ్లారి జిల్లా దన్‌పూర్ వద్ద ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో కంకరను అన్‌లోడ్ చేయడానికి వెళ్లాడు. మంగళవారం కంకర అన్‌లోడ్ చేస్తున్న సమయంలో జేసీబీతో కంకర లాగుతున్న సమయంలో జేసీబీ పుల్లర్ ప్రకాష్ ఎడమ భుజంపై పడినట్లు తెలిపారు. అదే సమయంలో ప్రకాష్ కంకరలో పూర్తిగా ఇరుక్కుపోయింది.. ఈ సంఘటనలో ప్రకాష్ ఎడమభుజం పూర్తిగా దెబ్బతినిందని రాయలచెరువు గ్రామస్థులు తెలిపారు. బాధితుడిని సంఘటన ప్రాంతం నుంచి కొప్పల్ మెడికల్ కాలేజీకి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

శిశువులకు టీకా తప్పనిసరి: డీహెచ్‌ఓ



శిశువును పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బాల్యంలో పిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే 12ప్రాణాంతక వ్యాధులను నివారించడానికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా టీకాలు అందిస్తారని, వాటిని తప్పకుండా వేయించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి రమేశ్‌బాబు అన్నారు. కురుగోడు తాలూకాలోని కొలుకు గ్రామంలో మంగళవారం నవజాత శిశువులు, గర్భిణులు, బాలింతల ఇళ్లను సందర్శించి, వారి ఆరోగ్యంపై ఆయన ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన వెంటనే నవజాత శిశువులకు పోలియో నివారణకు రెండు పోలియో చుక్కలు, బాల్య క్షయ నివారణకు హెపటైటీస్ బీ, అంతర్గత రక్తస్రావం నివారణకు విటమిన్ కే, ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. టీకాలు వేయకపోతే పిల్లలు ప్రాణాంతక బాల్య వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు వీటిపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. పోలియోకు పోలీయో వాక్సిన్, క్షయవ్యాదికి బీసీజీ వ్యాక్సిన్, కామెర్లకు హెపటైటీస్ వ్యాక్సిన్, డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతాలకు వ్యాక్సిన్లు, విరేచనాలకు రోటావైరస్, న్యుమోనియాకు తదితర వ్యాధులకు వ్యాక్సీన్లు వేయాలన్నారు. ఎలాంటి పుకార్లను నమ్మకుండా అన్ని టీకాలు వేయించుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్‌దాసప్ప, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వీరేశ్, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ అధికారి శరణమ్మ, సిద్దమ్మ, ఆశా కార్యకర్తలు రాధ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



వాటర్ బాటిళ్లు, మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

బళ్లారిరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిడిబండి ఉత్సవం సందర్భంగా భక్తులకు దాతలు అన్నదానం, మజ్జిగ విరివిగా పంపిణీ చేశారు. బళ్లారి రియల్ ఎస్టేట్ సంఘం ఆధ్వర్యంలో ఖమజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. రియల్ ఎస్టేట్ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున దాహం తీర్చడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అడుగడుగునా అన్నదానం చేపట్టి పలువురు దాతృత్వాన్ని చాటుకున్నారు.



అన్నదానం చేస్తున్న ఉప్పర సమాజ సభ్యులు

పరీక్షలు అభ్యాసానికి కొలమానం

● టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ,మార్చి 11(ఆంధ్రజ్యోతి): పిల్లల అభ్యాసాన్ని సమష్టిగా కొలవడానికి పరీక్షలు అధికారిక సాధనమని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి అన్నారు. మంగళారం తాలూకాలోని సంజీవరాయకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పరీక్షలు రాస్తున్న పిల్లలను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. బళ్లారి తూర్పు జోన్‌లోఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు అన్నిపాఠశాలల్లో మాతృభాష కన్నడలో 40మార్కుల 90 నిముషాలకు రెండవ సంచిత రాత పరీక్ష 10మార్కులకు మౌఖిక పరీక్ష నిర్వహి స్తున్నారు. విద్యార్థులు భయం, భయాందోళన, నిరాశ లేకుండా పరీక్ష రాయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తగిన రీతిలో తీర్చిదిద్దాలన్నారు.

వైభవంగా కోడి వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో కోడి వీరభద్రుడు

కంప్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సండూరు తాలుకా పరిధిలోని కొత్త దరోజీ గ్రామ ఆరాధ్యదేవులైన కోడి వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. పలు గ్రామా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యంపై రైతుల నిరసన

కంప్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా కల్పించాలని కోరుతూ అఖిల కర్ణాటక రాజ్య కిసాన్ జాగృతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి జెస్కామ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెస్కామ్ కార్యాలయ ప్రాంగణంలో నిరసనలు చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాధర, తాలుకా అధ్యక్షుడు గుబ్బాజి రామాంజిని మాట్లాడుతూ కంప్లి తాలుకా రాంసాగర్, కణివే తిమ్మలాపురం, నెం.10 ముద్దాపురం చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా వుందన్నారు. రాత్రి పూట విద్యుత్ సరఫరా కారణంగా రైతులు ఎలుగుబంట్లు, చిరుతలు, పాముల దాడులకు గురవుతున్నారన్నారు. రైతులకు అనువైన సమయంలో విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు. జెస్కామ్ ఏఈఈ మల్లికార్జునగౌడ్ రైతులతో మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామని, ఇబ్బంది లేకుండా తగిన సమయంలో సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు నిరసన విరమించారు. కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షుడు ఉల్లి రాము, మస్తాన్, సీ మల్లికార్జున, శివప్ప, గంగాధర, వెంకటేష్, హర్షిత్, నీలప్ప, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



జెస్కామ్ కార్యాలయం వద్ద ఆందోళనలో రైతులు



కార్యక్రమాన్నిప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

వృద్ధులను గౌరవిద్దాం

● జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. ప్రభుత్వం వృద్ధుల కోసం రక్షణ, సాధికారతకు అనేక పథకాలను అమలు చేసిందని, వాటిని అందరికీ అందేలా చూడాలన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగులు, వృద్ధులు, సాధికారత సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డన గౌడ రంగమందిరంలో మంగళవారం నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ జాతీయ యుగ శ్రీ పథకం కింద వృద్ధులకు ఉచిత పరికరాలపంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ యుగ శ్రీపథకం కింద సీనియర్ సిటిజన్లకు ఉచిత పరికరాలను పంపిణీ చేశారు. ఈపరికారాలు వయసు సంబంధిత వైకల్యాల నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలను తగ్గించడంలో సహాయపడుతాయని, వృద్ధులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ కార్యక్రమాన్ని అధ్యక్షత వహించి మాట్లాడుతూ వైకల్యం శాపం కాదన్నారు. ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ వృద్ధ భద్రతా పథకం కింద నమోదు చేసుకున్న జిల్లాలోని 582 మంది సీనియర్ సిటిజన్లకు 1,754 వివిధ రకాల పరికారాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి జలాలప్ప, డా.వీరేంద్రకుమార్, ఈసీఓ అధికారి మంజునాథ్, సీనియర్ సిటీజన్లకోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు .సీనియర్‌సిటీజన్లు పాల్గొన్నారు.

పొగాకు దుష్ప్రభావాలపై వీధి నాటకం



వీధి నాటకాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ అధ్యక్షుడు ప్రశాంత్

బళ్లారి సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పొగాకు దుష్ప్రభావాలపై ప్రదర్శించిన వీధి నాటకం విశేషంగా ఆకట్టుకుంది. జిల్లాలోని కురుగోడు తాలూకాలోని కోళూరు , దమ్మూరు గ్రామాల్లో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా సర్వే యూనిట్, జిల్లా పొగాకు నియంత్రణ సెల్, చిగురు కళాబృందం ఇబ్రహీంపూర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. పొగాకు, గుట్కాతో ప్రాణాల మీదికి తెచ్చుకోరాదని సందేశం వినిపించారు. ఈకార్యక్రమాన్ని కోళూరు గ్రామ పంచాయితీ అధ్యక్షురాలు పెద్దబసమ్మ, దమ్మూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ సభల అధ్యక్షుడు, పొగాకు నియంత్రణ సెల్ జిల్లా సలహాదారు ప్రశాంత్, సామాజిక కార్యకర్త సరస్వతి, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు వీరేష్, సిద్దమ్మ, బసవ, శంక్రమ్మ, గ్రామ ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ నాయకులు, చిగురు కళాబృందం కళాకారులు హులుగప్ప, హనుమయ్య, సుంకప్ప, ఆనంద్, హేమంత్, సునీల్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం



మహిళలతో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

సిరుగుప్ప, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని సిరుగుప్ప తాలుకా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం తాలుకాలోని రారావి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 50 మందికి పైగా మహిళలను సన్మానించారు. నేటి రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు ఆయన తెలిపారు. ముందురోజుల్లో మహిళలకు 50 శాతం పెరిగే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలని వినతి



పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్‌కు మనవిపత్రం ఇస్తున్న కరవే సభ్యులు

కంప్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఇందిరా క్యాంటీన్ సమీపంలో ప్రయాణికులకు మినీ బస్టాండు నిర్మించాలని డిమాండ్ చేస్తూ రక్షణ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రెసిడెంట్ బి విరూపాక్షి యాదవ్ మాట్లాడుతూ ఇక్కడి పాత బస్టాండు సమీపంలో మినీ బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ బస్టాండు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ పాత బస్టాండు నుండి సనాపూర్ మార్గంలో సిరుగుప్ప, ఎమ్మిగనూరు మార్గంలో కురుగోడు వరకు దీంతో పలుపట్టణాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రదేశానికి బస్సు వచ్చే వరకు విశ్రాంతి తీసుకోవడానికి స్థలం లేదు. వృద్ధులు, పిల్లలు, మహిళలు రోడ్డు పక్కన నిలబడి బస్సు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. 12వ వార్డులో మురుగు కాలువలు, తాగునీరు, రోడ్డు, వీధి దీపాలతో పాటు పలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే దొడ్డ బసప్ప, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జే శివకుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బి మంజుళ, ఉపాధ్యక్షురాలు కవిత, తాలుకా అధ్యక్షులు జగదీష్ పూజారా, గౌరవాధ్యక్షులు గోపాలప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు

సిరుగుప్ప, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని జడ్పీ సీఈఓ మహమ్మద్ హారున్ సోమర్ అధికారులకు సూచించారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో ప్రగతి పరిశీలన సభ జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసకుని తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు.

హోసూరు జోన్

సోదరుడి హత్య కేసులో జీవితఖైదు

హోసూరు(క్రైం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సోదరుడి హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. 9 సంవత్సరాలుగా సాగుతున్న కేసు కొలిక్కి వచ్చింది. హోసూరు సమీపంలోని రాయకోట ప్రాంతానికి చెందిన వెంకటేశ్(31) తల్లిదండ్రులు ఓ బాలికను దత్తత తీసుకున్నారు. తల్లిదండ్రుల ఆస్తితో తన దత్తపుత్రికకు పూర్తి హక్కు కల్పిస్తానని వెంకటేశ్ తెలపడంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్, అతని పెద్దనాన్న కుమారుడు సుందరరాజు(44)ను 2016లో వెంకటేశ్‌తో కలిసి మద్యం సేవించే సమయంలో ఆస్తిలో వాటా తనకు లేనందున తన తల్లిదండ్రులను హత్య చేస్తానని వెంకటేశ్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ విషయంపై తన పిన్నిని, బాబాయ్‌ని హత్య చేయవద్దని సుందరరాజు వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో సుందరరాజు ఈ విషయంలో జోక్యం తగదని హెచ్చరించిన వెంకటేశ్, తన మాటలను పట్టించుకోకపోవడంతో సుందరరాజుకు కోపం వచ్చి కత్తితో తన సోదరుడి వరుసైన వెంకటేశ్‌ను పొడిచి హతమార్చాడు. కేసు నమోదు చేసి 9 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కేసులో రాయకోట పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో సుదీర్ఘ విచారణ కొనసాగింది. న్యాయమూర్తి సంతోష్ నిందితుడు సుందరరాజుకు జీవితఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సుందరరాజును సేలం సెంట్రల్ జైలుకు తరలించారు.

శేషవాహనంపై చంద్రచూడేశ్వర స్వామి

హోసూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని కొండపై వెలసిన మరకతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా పాలకంబం నాటి గణపతి పూజ నిర్వహించారు. ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణం అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మొదటిరోజు సింహ వాహనంపై ఊరేగింపు, రెండోరోజు నెమళ్ల వాహనంపై ఉత్సవం, మూడో రోజు నందివాహనంపై ఊరేగింపు పురవీదుల్లో స్వామివారిని ఊరేగించారు. 14వ తేదీన రథోత్సవానికి తయారుచేసుకున్న తమ తమ వంశస్తులు స్వామి వారికి మ్రొక్కులు తీర్చుకుంటారు. రథోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేయనుండడంతో అన్ని భద్రతా చర్యలు చేపట్టారు.



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 11(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పంచాయతీ యూనియన్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్ పర్యటించి ప్రజల సమస్యలను ఆలకించారు. ఇదే సందర్భంగా పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. నారలపల్లి పంచాయతీ ఎక్కలనత్తం కొండగ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ దినేశ్‌కుమార్ గిరిజన ప్రాంతాలలో పర్యటించి మౌలిక వసతులపై ఆరా తీశారు. అంబులెన్స్ సౌకర్యం, చౌకధరల దుకాణం, గృహ వసతి కల్పించాలని గ్రామస్థులు కోరారు. అంబులెన్స్ రాకపోకలకు చర్యలు తీసుకుంటామని, 230 కుటుంబ కార్డు దారులు ఉండడంతో త్వరలోనే తాత్కాలిక చౌకడిపో ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు, తాగునీటి సౌకర్యం వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ఆరా తీశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిణి కవిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మలర్విళి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శరవణన్, జగదీశ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్